క్లుప్తంగా

జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత భరద్వాజ వర్ధంతి



భరద్వాజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చేతి వృత్తుల సంక్షేమ సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ వర్ధంతి కార్యక్రమం స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, సంఘ ప్రతినిధులు తొలుత రావూరి భరద్వాజ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ రావూరి రాసిన రచనలు, కావ్యాలు, నవలలు నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పడతాయని పేర్కొన్నారు. ఆయన రాసిన ప్రతి సాహిత్యంలోనూ సామాజిక స్పృహ, చైతన్యం ఉంటుందన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘ ప్రతినిధులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కముజు సుందరరావు, కుడుపూడి గోపాలకృష్ణ, ముస్కూరి ఏసుబాబు పాల్గొని నివాళులర్పించారు.

సబ్ స్టేషన్‌లో ఆటోమేటిక్ రెయిన్ గేజ్ మీటర్ పరిశీలన



రెయిన్ గేజ్ మీటర్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో 132/33 కేవీ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో అమర్చిన ఆటోమేటిక్ రెయిన్ గేజ్ మీటర్ పనితీరును అధికారులతో కలిసి కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాపాతం వివరాలు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి అందుతాయన్నారు. వర్షపాతం ఆధారంగా అధికారులను అప్రమత్తం చేయడానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజబాబు, కార్యనిర్వాహక ఇంజినీర్ మోకా రవికుమార్, డివిజనల్ ఇంజినీర్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తోలు బొమ్మలాట



అమలాపురంలో వేదికపై తోలు బొమ్మలాట ప్రదర్శన

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ ఏటా శరన్నవ రాత్ర మహోత్సవాలకు పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పురాతన ప్రదర్శన అయిన తోలు బొమ్మలాట (చర్మ చిత్ర కళ)ను కూడా ప్రోత్సహించింది. శరన్నవ రాత్ర ఉత్సవాల ముగింపు రోజైన గురువారం రాత్రి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తోలు బొమ్మలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది రామాయణంలోని లంకేశ్వర ఘట్టాన్ని తోలు బొమ్మలాట ద్వారా ప్రదర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గౌతమి తోలు బొమ్మలాట బృందం ఈ ప్రదర్శన నిర్వహించింది. దాదాపు పది మంది కళాకారులు ఈ తోలు బొమ్మలాట ప్రదర్శనను నిర్వహించి పద్యాలు, దృశ్యాలు, సంగీత వాయిద్యాలతో అలరించాయి. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో శరన్నవ రాత్రి ముగింపు కార్యక్రమం జరిగింది. తోలు బొమ్మలాట ప్రదర్శనతో దసరా ఉత్సవాలు ముగిశాయి.

అన్నసమారాధన

తాళ్లరేవు: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఇంజరం కనకదుర్గమ్మ ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కాకరపర్తి బాబీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన మూడు వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హాట్ బాక్సులు, కుర్చీల వితరణ

అల్లవరం: గోడితిప్ప యూపీ పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం వేడిగా ఉండేందుకు అవసరమైన హాట్ బాక్సులను గ్రామానికి చెందిన లాయర్ కొల్లు త్రినాథవర్మ శుక్రవారం అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు బసవా శేషమాంబ, అడపా సత్యనారాయణ, వనలక్ష్మీ జ్ఞాపకార్థంగా రూ.6 వేలు విలువ చేసే కుర్చీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి దుర్గాలక్ష్మి, చిట్నీడి శ్రీను, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైదానాల్లేక క్రీడలకు దూరం

- పాఠశాలల్లో వసతుల్లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరవు



క్రీడామైదానం లేని ఐ.పోలవరం మండలం మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల



తాళ్లరేవు మండలం చొల్లంగిపేట గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం

ఐ.పోలవరం: పాఠశాల క్రీడలకు మహర్దశ పట్టింది. జాతీయ పోటీలు కామన్‌వెల్త్ పోటీలు అమరావతిలో ఒలింపిక్స్ నిర్వహిస్తాం వంటి ప్రకటనలు టీడీపీ హయాంలో మనం వింటున్నా కానీ ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో సరైన మైదానాలు, వసతులేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. క్రీడలకు దూరమవుతున్నారు. కొన్ని చోట్ల అయితే మైదానాలు ఉన్నా క్రీడా సామగ్రి లేక క్రీడాకారులు ఆసక్తిని కోల్పోతున్నారు. ప్రోత్సాహం లేక ప్రతిభ ఉన్నా గ్రామాలకే పరిమితమవుతున్నారు.

ఇదీ పాఠశాలల పరిస్థితి..

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీలతోపాటు అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో మొత్తం 74 జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 28 పాఠశాలలకు మైదానాలు లేవు. ఉన్న చోట్ల పెద్దగా ఆడుకునేందుకు అవకాశాలు లేవు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో బాలుర, బాలికోన్నత పాఠశాలలో మైదానాలు, క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. మున్సిపల్ పాఠశాలల్లో మాత్రం వసతులు అంతంత మాత్రమే.

- ఉప్పలగుప్తం మండలంలో ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా భీమనపల్లి, గొల్లవిల్లి, ఎన్.కొత్తపల్లి పాఠశాలలకు విద్యార్థులు ఆడుకునే అనువైన మైదానాలు ఉన్నాయి. కానీ వసతులు లేవు.
- చల్లపల్లి, వాసలతిప్ప పాఠశాలలకు గ్రౌండ్ చిన్నదిగా ఉండడంతో విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, షార్ట్ పుట్, ఖోఖో వంటి ఆటలు మాత్రమే ఆడుతున్నారు.
- ఎస్.యానం పాఠశాలలో పక్కనున్న ఎంపీపీ పాఠశాలను ఆనుకుని గ్రౌండ్ ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరైన అదనపు తరగతి గదులను ఆ ప్రాంతంలో కట్టడానికి నిర్ణయించారు. మునిపల్లి, గోపవరం పాఠశాలలకు మైదానాలు లేవు.
- అల్లవరం మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో తూర్పులంక, సామంతకుర్రు ఉన్నత పాఠశాలలకు మైదానాలు లేవు
- కాట్రేనికోన మండలం దొంతుకుర్రు, కందికప్ప ఉన్నత పాఠశాల మైదానాలు నిరుపయోగంగా ఉన్నాయి. సాపేవారిపల్లి, పి.లక్ష్మీవాడలలో మైదానాలు లేవు.
- తాళ్లరేవు మండలంలో 12 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒక గురుకుల పాఠశాల ఉన్నాయి. వీటిలో పిల్లంక, ఇంజరం, నీలపల్లి హైస్కూళ్లకు క్రీడా ప్రాంగణాలు లేవు.
- చొల్లంగిపేట గురుకుల పాఠశాల, చిన్న బొడ్డు వెంకటయ్యపాలెం హై స్కూల్ క్రీడా ప్రాంగణాలు తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా ఉన్నాయి. ముమ్మిడివరం, అమలాపురం మండలాల్లో సైతం ఇదే పరిస్థితి.
- పాఠశాల స్థాయిలో అంటే 13 నుంచి 15 ఏళ్ల వయస్సులో క్రీడాకారుల ప్రతిభను గుర్తించి తర్ఫీదు ఇస్తేనే భవిష్యత్‌లో వారు ఉన్నత స్థానాలకు ఎదుగుతారు. కానీ ఈ వయస్సులో వారికి మంచి శిక్షణ లేకపోవడంతో వల్ల అతి తక్కువ మంది మాత్రమే క్రీడల్లో రాణిస్తున్నారని క్రీడా నిపుణులు వాపోతున్నారు.

ఘనంగా మాజీ ఎంపీ అనురాధ పుట్టినరోజు వేడుకలు



పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ పుట్టినరోజు వేడుకలను మొగళ్లమూరులోని ఆమె నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను అనురాధ కట్ చేయగా పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, పార్టీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పోచినపెద్ది సందీప్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ అనురాధ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు కొనుకు గౌతమి, మట్టా శైలజ, ఏపీ అగ్రికల్చర్‌మిషన్ మాజీ సభ్యులు జున్నూరి రామారావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, దాకారపు చిరంజీవిరావు, బర్రే సీతారత్నం, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరీ, కర్రి సత్య, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, కుడుపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

షాపుల అద్దె పెంచొద్దు

- పాత పద్ధతినే కొనసాగించాలి
- మున్సిపల్ సర్క్యులర్ బజార్ వ్యాపారుల వినతి



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి వినతిపత్రం అందిస్తున్న, వ్యాపార సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సమీపంలో దాదాపు 55 షాపులతో ఉన్న పొట్టి శ్రీరాములు మున్సిపల్ సర్క్యులర్ బజార్‌లో దాదాపు 18 ఏళ్ల నుంచి లీజుదారులుగా ఉన్న వ్యాపారుల బృందం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజులను శుక్రవారం కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రస్తుతం అద్దె పెంచేందుకు సిద్ధమవుతున్న మున్సిపాలిటీ అద్దెల పెంపు జోలికి వెళ్లకుండా పాత పద్ధతిలోనే కొనసాగించాలని వ్యాపారులు వినతి పత్రాలు అందించారు. ప్రతి నెలా మున్సిపాలిటీకి అద్దెలు చెల్లిస్తున్నామని, తమలో కొంత మంది సకాలంలో అద్దెలు చెల్లించకపోయినా వడ్డీతో సహా చెల్లిస్తున్నామని వివరించారు. అద్దె తీసుకున్న షాపులకు ప్రతి మూడేళ్లకు 33.3 శాతం, జీఎస్‌టీ 18 శాతంతో కలిపి అద్దెలు పెంచుతూ వస్తున్నారని గుర్తు చేశారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా దాదాపు ఆరు నెలలపాటు షాపుల మూసివేసినా అద్దె బకాయిలు వడ్డీతో సహ చెల్లించామని వివరించారు. వ్యాపారుల కష్ట నష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం షాపులకు అద్దెలు పెంచకుండా పాత అద్దెల విధానాన్నే కొనసాగించాలని ఆ వినతి పత్రాల్లో వ్యాపారులు అభ్యర్థించారు. సర్క్యులర్ బజార్ వర్తక సంఘం అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్, గౌరవాధ్యక్షుడు అల్లాడ రమణ, కార్యదర్శి మలకా రాజేష్, కోశాధికారి తాడి రవి తదితరులు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌లకు వినతి పత్రాలు ఇచ్చారు.

ఓఎన్జీసీ పరిహారం అందించాలి



ఎంపీ వైథిలింగాన్ని సత్కరిస్తున్న యానాం నాయకులు

యానాం: యానాం నియోజకవర్గ మత్స్యకారులకు మంజూరు చేసిన ఓఎన్జీసీ నష్ట పరిహారాన్ని దీపావళికి ముందే అందించాలని పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు వైథిలింగంను కాంగ్రెస్ నాయకుడు మల్లాడి సత్తిబాబు కోరారు. శుక్రవారం పుదుచ్చేరిలో ఆయన కార్యాలయంలో కలసి నియోజకవర్గంకు సంబంధించి పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మల్లాడి సత్తిబాబు మాట్లాడుతూ ఓఎన్జీసీ రెండో విడత పరిహారం దీపావళికి ముందే వేయాలని, ఆ విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. 2026లో జరిగే పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేలా పార్టీ పటిష్టవంతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి కోరారు. అంతకముందు వైథిలింగంను సత్తిబాబు దుశ్శాలువాతో సత్కరించారు. నాయకులు మల్లాడి బీరాస్వామి, వేపాటి వెంకటేశ్వర్లు, కాటూరి చొదరి పాల్గొన్నారు.

అధ్వాన రహదారులు



సుంకరపాలెం వద్ద గోతులమయంగా ఉన్న యానాం- ద్రాక్షారామ రహదారి

తాళ్లరేవు: పలు రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రధానంగా మండలంలోని యానాం- ద్రాక్షారామ రహదారిలో ప్రయాణం ప్రహసనంగా మారింది. రోడ్డుకిరువైపులా పెద్ద పెద్ద గోతులతో అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఆదమరిస్తే అంతే సంగతులు అన్నట్లు ఏ మాత్రం అదుపుతప్పినా గోతుల్లో పడి గాయాలపాలు కావాల్సిందే. ఇప్పటికే చాలా మంది ఆయా గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టిసారించి రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ క్వెస్ట్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఐ.పోలవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో నిర్వహించిన డిజిటల్ క్వెస్ట్ (సాంకేతిక సాధన) పోటీల్లో ఐ పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చాటిందని హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు తెలిపారు. అమలాపురం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన సాంకేతిక సాధన పోటీల్లో 22 హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని వీరిలో ఐ పోలవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని నక్కా సత్యశ్రీ మీనన్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైౖ ందన్నారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్లు శాంతకుమార్, గంటా రమ్యను స్కూల్ కమిటీ చైర్మెన్ బొలిశెట్టి వీర్రాజు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక



ఉన్నత స్థాయి సమావేశంలో ఎల్జీ కైలాసనాథన్, సీఎం రంగసామి తదితరులు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ సర్వతోముఖాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక గురించి శుక్రవారం ఎల్జీ కె.కైలాసనాథన్ అధ్యక్షతన సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రుల సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుదుచ్చేరి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రపంచ బ్యాంకు, ఏడీబీ సహాయంతో వివిధ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రతిపాదించిన వాటిపై చర్చించారు. పారిశ్రామిక ఎస్టేట్‌లు, ఉపాధి, ఆదాయ సామర్థ్యాలను పెంచడం, ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో కోస్టల్ ఆర్థికాభివృద్ధి ప్రాజెక్టు (పీవైషోర్), తీరప్రాంత జీవనోపాధి మెరుగుదల కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణ శాఖ ద్వారా రూ.1433 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ కోసం పీడబ్ల్యూడీ ప్రతిపాదించిన ప్రాజెక్టుల గురించి చర్చించారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక ప్రగతి 65.99 శాతం పుదుచ్చేరిలో ఉందన్నారు.

సాంకేతిక సాధన పోటీల్లో సత్తా చాటిన సత్యశ్రీ



విద్యార్థిని సత్యశ్రీ మీనన్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఐ పోలవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో నిర్వహించిన డిజిటల్ క్వెస్ట్ (సాంకేతిక సాధన) పోటీల్లో తమ విద్యార్థిని ప్రతిభ చాటిందని ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమలాపురం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన సాంకేతిక సాధన పోటీల్లో 22 హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కాగా హైస్కూల్ విద్యార్థిని నక్కా సత్యశ్రీ మీనన్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినికి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్లు శాంతకుమార్, గంటా రమ్యను స్కూల్ కమిటీ చైర్మెన్ బొలిశెట్టి వీర్రాజు, టీచర్లు, పెద్దలు అభినందించారు.

మున్సిపల్ ఆటో టిప్పర్ డ్రైవర్ల నిరసన

3 నెలలుగా జీతాలు లేక అల్లాడుతున్నామని ఆవేదన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో టిప్పర్ డ్రైవర్లు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రతినిధి సత్తిబాబు తదితరులు

అమలాపురం టౌన్: గత మూడు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ పట్టణ పారిశుధ్య విభాగంలో ఆటో టిప్పర్ డ్రైవర్లు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తమకు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు జీతాలు ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెత్తపై పన్ను ఎత్తి వేసిన తర్వాత నుంచే మాకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీకి కేటాయించిన 12 ఆటో టిప్పర్ల డ్రైవర్లు నిరసనలో పాల్గొన్నారు. ఏపీ ఆటో టిప్పర్ డ్రైవర్ల సంఘానికి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ ప్రతినిధులు కూడా ఈ నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. జిల్లా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సమితి కార్యనిర్వాహకుడు కె.సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం లేదా సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు డ్రైవర్ల జీతాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆటో టిప్పర్ డ్రైవర్ల సంఘం కన్వీనర్ కుంచే అరుణకుమార్ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. మున్సిపాలిటీ అధికారులు, పాలక మండలి ప్రజా ప్రతినిధులు డ్రైవర్లకు పెండింగ్ జీతాలు ఇప్పించేందుకు అటు ప్రభుత్వంపైన, ఇటు కాంట్రాక్ట్ సంస్థపైన ఒత్తిడి తేవాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. డ్రైవర్ల సంఘం ప్రతినిధి మురళీ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

యానాం: యానాం, పుదుచ్చేరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్తిస్థాయిలో హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం పుదుచ్చేరి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (హెడ్ కార్వర్ట్స్) సుభమ్ ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న తిక్కిరెడ్డి వివిఎస్‌సి కృష్ణ, వడగన రమేష్, పెయ్యల గణేష్, నాగం ప్రతాప్‌కృష్ణ, పంపన వెంకటరమణమూర్తి, కమిడి సాహెబ్, సంగాడి శ్రీనివాసు, పెంకే గణేష్, మెండుగుల ప్రభాకర్, డి.శ్యామ్ సుందరరావు, వెంకటేశ్వర్లు ఎస్, చింతా వీరభద్రరావు, కె కృష్ణమూర్తి, బడుగు దుర్గారావు, అరదాడి పోశియ్య, దేవరపల్లి సూర్యప్రకాశరావులకు పదోన్నతి లభించింది. వీరందరికీ త్వరలో పోలీస్ ట్రైనింగ్ స్కూల్‌లో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

కంపోస్ట్ యార్డ్ తనిఖీ

అమలాపురం రూరల్: బండారులంక కౌశిక వద్ద ఉన్న కంపోస్ట్ యార్డ్‌ను తొలగించాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేయడంతో శుక్రవారం కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశల మేరకు ఆర్డీవో కే మాధవి, డీపీవో శాంతాలక్ష్మి, డీఎల్‌పీవో బొజ్జిరాజు, తహసీల్దార్ కిషోర్‌బాబు, ఈవోపీఆర్డీ మంగాదేవి కంపోస్ట్ యార్డ్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం ఈ యార్డ్ ఎవరి స్థలంలో ఉందన్న దానిపై ఆరా తీశారు. తొలగిస్తే ఎక్కడ కంపోస్ట్ యార్డ్ ఏర్పాటు చేయాలనే దానిపై చర్చించారు. ప్రజల ఇబ్బందులను, సమస్యలను అధికారుల దృష్టికి సర్పంచ్ పెనుమాల సునీత తీసుకువెళ్లారు.

క్రీడాకారులకు షూస్ అందజేత



క్రీడాకారులకు షూస్ అందజేసిన మల్లాడి

యానాం: నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు ఆటల్లో విజయాలు సాధించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఈనెల 26, 27 తేదీల్లో మాహే రీజియన్‌లో నిర్వహించే స్టేట్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే క్రీడాకారులు ప్రస్తుతం స్థానిక వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. ఆయన శుక్రవారం వారందరికీ స్పోర్ట్స్ షూస్ అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-17 కేటగిరిలో వాలీబాల్ విభాగంనుంచి 12 మంది, టేబుల్ టెన్నిస్‌లో 24 మంది, ఫుట్‌బాల్‌లో 18 మంది, మొత్తం 54 మందికి మల్లాడి కృష్ణారావు షూష్ అందజేశారు. మాహేలో ఉన్నన్ని రోజులు క్రీడాకారులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి సహాయం



స్నేహితుని కుమార్తెకు చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తాళ్లరేవు: స్థానిక జెడ్పీ హైస్కూల్ 1987-88 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తమ స్నేహితుడు దివంగత మందారపు సుబ్రహ్మణ్యం కుమార్తె కామాక్షి వివాహానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు డైమండ్ గ్రూప్ పేరిట పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అనారోగ్యంతో మృతి చెందిన తమ స్నేహితుడు సుబ్రహ్మణ్యం కుటుంబానికి అండగా నిలిచారు. శుక్రవారం సామర్లకోటలో జరిగిన కామాక్షి, లోవకుమార్ వివాహ రిసెప్షన్‌లో నగదును డైమండ్ గ్రూప్ సభ్యుడు, తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్య రాజు, బాలయోగి అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు చేపడతామని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అధిక శాతం రోడ్డు ప్రమాదాలు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరుగుతున్నాయన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆయా కుటుంబాలు బాధపడాల్సిన పరిస్థితి వస్తుందని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

ఉప్పలగుప్తం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన చల్లపల్లి పంచాయితీ పరిధి వాసాలతిప్ప ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పి.గన్నవరం మండలం మొండెపులంక గ్రామానికి చెందిన కొప్పాడి నాగరాజు(29) తన అత్తవారి ఊరైన ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప గ్రామానికి రెండు రోజులు క్రితం వచ్చాడు. గురువారం ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ క్లీన్ చేసి ఫ్రిడ్జ్ వైర్‌ను ప్లగ్‌లో పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అమలాపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి పంపించామని ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.